సాక్షి చిత్తూరు

మంగళవారం । 16 । మే । 2023



నేరుగా విద్యుత్ కొనుగోలు

ఎన్టీపీసీ నుంచి ప్రభుత్వమే నేరుగా విద్యుత్ కొనుగోలు చేయనున్నట్లు ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున్ రెడ్డి తెలిపారు. -8లో



జాతరో జాతర

పలమనేరు జాతరలో అమ్మవారికి భక్తులు లక్షలాది కొబ్బరికాయలు సమర్పించగా, రోబో యువతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. -8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	41	28
తిరుపతి	41	27
తిరుమల	37	24
గూడూరు	44	31
నగరి	43	29

న్యూస్‌రీల్

వరసిద్ధుని సేవలో గంభీరానంద భారతి



స్వామికి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శృంగేరి విరూపాక్ష పీఠం గంభీరానంద భారతి మహాస్వామి సోమవారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్ర పటం అందించారు.

టెంకాయపై గంగమ్మ చిత్రం



యాదమరి: చిత్తూరు గంగ జాతర సందర్భంగా యాదమరి ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ దామోదరాచారి టెంకాయపై గంగమ్మ రూపాన్ని చిత్రీకరించారు. ఇది చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

దివ్యాంగ బాలికలకు వసతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని రెడ్డిగుంట బైపాస్ రోడ్డు వద్ద ఉన్న దివ్యాంగ బాలికల వసతి గృహంలో ప్రభుత్వం వసతి సౌకర్యం కల్పిస్తోందని ఆ శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 3 వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ఆపై చదువులు చదివే దివ్యాంగ బాలికలకు వసతి గృహంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వసతి గృహంలో ఆహ్లాదకరమైన వాతావరణం, పౌష్టిక ఆహారం, పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లేందుకు ఆటో, రిక్షా సదుపాయం కల్పించనున్నట్లు వివరించారు. విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణకు ప్రత్యేకంగా స్టాఫ్ నర్సు ఉంటారని తెలిపారు. ప్రవేశాలు పొందాలనుకునే దివ్యాంగ బాలికలు 9440990698 ని సంప్రదించాలని ఆయన కోరారు.

పకడ్బందీగా వైఎస్సార్ కంటి వెలుగు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా నిర్వహించే స్క్రీనింగ్ ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. సర్జరీలు నిర్వహించేందుకు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డీఎంహెచ్‌వో ప్రకాశం, ఇతర వైద్యారోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

నవోదయకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జవహర్ నవోదయ విద్యాలయలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా వలసపల్లిలో ఉన్న నవోదయ విద్యాలయలో 2023–24లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, కామర్స్ గ్రూపులలో ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 31 వ తేదీ లోపు వెబ్‌సైట్ www.navodaya.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష తేదీ, ఇతర వివరాలు ఆ వెబ్‌సైట్‌లో ఉంటాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అమ్మను దర్శిద్దాం.. జాతర చేద్దాం

అసలు పండగంటేనే జాతర. జిల్లా కేంద్రంలో ఈరోజు ఇంటింటా పండగే. ఏటా నిర్వహించే గంగజాతరకు నగరం ముస్తాబైంది. పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులతో నగరమంతా సందడిగా మారింది. భక్తులు విశేషంగా ఆరాధించే గ్రామదేవత నడివీధి గంగమ్మ జాతర నేడు కనులపండువగా నిర్వహించేందుకు ప్రజలు సన్నద్ధమ్యారు. నగరంలో వాడవాడలా గంగమ్మ మండపాలు కొలువుదీరాయి. విద్యుత్‌దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంటోంది. నేటి ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకుని, జాతర చేయనున్నారు.

- నేడే నడివీధి గంగమ్మ జాతర
- వేకువ జామున తొలిపూజ
- చిత్తూరులో ఇంటింటా పండగ

చిత్తూరు రూరల్: నడి వీధిలో గంగమ్మ జాతర అంటే నగర వాసులకు రెండో పెద్దపండుగ. జాతరకు 15 రోజులకు ముందు నుంచే జాతర నిర్వాహకులు ఏర్పాట్లను ముమ్మరంగా చేపట్టారు. భారీస్థాయిలో చలువ పందిళ్లు, వాటికి వస్త్రాలంకరణ, అర్ధ కిలోమీటరు మేర క్యూలైన్లు, అమ్మవారి ప్రతిమలతో విద్యుత్ దీపాలంకరణలు, తోరణాలు కట్టి ఏర్పాట్లను సోమవారంతో పూర్తి చేశారు. భక్తులు అమ్మవారికి అంబలి పోసేందుకు కావాల్సిన సామగ్రిని తీసుకొచ్చి అందుబాటులో ఉంచారు.

తొలిపూజ ఇలా...

నడివీధిలో అమ్మవారిని ప్రతిష్ఠించడం తరతరాల నుంచి వస్తున్న ఆనవాయితీ. ఆ ఆచార అలవాట్ల ప్రకారం అక్కడ గంగమ్మ తల్లిని మంగళవారం వేకువజామున కొలువుదీర్చి, ఉదయం 5 గంటలకు వంశపారం పర్య ధర్మకర్తలు, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు కుటుంబీకులచే అమ్మవారికి తొలిపూజ నిర్వహించి తెరను లాంఛనంగా తొలగిస్తారు. ఇక భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి అంబలి పోస్తారు. నిత్యపూజలు కొనసాగుతాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. రాత్రి డప్పువాయిద్యాల నడుమ భక్తులు ఊరేగింపుగా వచ్చి పిండి వంటలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

నిమజ్జనం

దర్శనమిచ్చిన మరుసటి రోజు అంటే బుధవారం అమ్మవారు నిమజ్జనానికి సిద్ధమవుతారు. సాయంత్రం 4 గంటలకు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు పొన్నియమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి ర్యాలీగా వచ్చి అమ్మవారికి సారె సమర్పిస్తారు. ఈ కార్యక్రమం తర్వాత అమ్మవారు నిమజ్జనానికి బయలుదేరుతారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి ఊరేగింపు వేడుకగా ఉంటుంది. ఊరేగింపులో భాగంగా ఆర్కెస్ట్రా, పలు వాయిద్యాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అమ్మవారు కట్టమంచి చెరువుకు చేరుకోవడంతో నిమజ్జన కార్యక్రమం ముగుస్తుంది.



కొంగారెడ్డిపల్లి పందిరిలో ఏర్పాటు చేసిన క్యూలు

ఓం శక్తి భక్తుల విన్యాసం

40 రోజుల పాటు మాల ధారణతో దీక్షలో ఓంశక్తి భక్తులు తమ మొక్కులు చెల్లించేందుకు స్థానిక అగస్తీశ్వర స్వామి ఆలయంలో నోటికి శూలాలు గుచ్చుకుని, వీపునకు కొక్కీలు ధరించి నిప్పు కుండలతో చర్చి వీధి నుంచి ఊరేగింపుగా వస్తారు. ఈ విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉంటాయి.



నడివీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం

- సంతపేటలో మంగళవారం ఉదయం 6.30 గంటలకు తొలిపూజ ప్రారంభం కానుంది. అంబలి పోసే కార్యక్రమం, అమ్మవారి దర్శనం, విశేష పూజలు వెంటనే మొదలవుతాయి. రాత్రి 7 గంటలకు కుంభ సమర్పణ, 9గంటలకు తమిళ వీధి నాటక ప్రదర్శన జరుగుతుంది. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు ప్రారంభమవుతుంది.
- కట్టమంచిలో సోమవారం రాత్రి 10.30 గంటలకు స్థానిక కాళికాదేవి ఆలయం నుంచి అమ్మవారి శిరస్సును రజకుల ఇంటిలోకి తీసుకెళ్తారు. అక్కడి నుంచి మంగళవారం వేకువజామున 3.30 గంటలకు కట్టమంచి జాతర మండపానికి తీసుకొస్తారు. ఉదయం 5.30 గంటలకు తెర ప్రారంభించి తొలి పూజ చేస్తారు. భక్తుల అంబలి, కానుకల సమర్పణ, సాయంత్రం 6.15 గంటలకు నుంచి కుంభ సమర్పణ, రాత్రి 9గంటలకు పాటకచ్చేరి కార్యక్రమాలు కొనసాగుతాయి. బుధవారం రాత్రి 7గంటలకు అమ్మవారు నిమజ్జనానికి బయలు దేరుతారు.



ఆకట్టుకుంటున్న ఎలక్ట్రానిక్ గంగమ్మ శిరస్సు

భలేభలే గంగమ్మ

గంగజాతరను పురస్కరించుకుని నగరంలోని సంతపేటలో కొలువుదీరిన ఎలక్ట్రానిక్ గంగమ్మ శిరస్సు విశేషంగా ఆకట్టుకుంటోంది. గంగమ్మ కళ్లు మూస్తూ తెరుస్తూ ఉండేలా సెట్ చేశారు. అమ్మవారి తలపైభాగంలో గొడుగు తిరుగుతూ ఉంటే, దేవకన్యలు వింధ్యమరలు విసురుతున్నట్లు, గణపతి, సుబ్రమణ్యస్వామి హారతులు పట్టేలా ఏర్పాట్లు చేసిన సెట్టింగ్ ప్రజలను విపరీతంగా ఆకట్టుకుంటోంది.

- దొడ్డిపల్లిలో సోమవారం రాత్రి 9 గంటలకు గంగమ్మశిరస్సు ఊరేగింపుగా ఇంటింటికీ వెళుతుంది. ఈ కార్యక్రమం మంగళవారం ఉదయం 5గంటల వరకు కొనసాగుతుంది. ఉదయం 8గంటలకు మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అంబలి పోస్తారు. సాయంత్రం 6 గంటలకు కుంభం, పాట కచ్చేరి, రాత్రి 9గంటలకు వీధినాటకం ప్రారంభమవుతుంది. బుధవారం సాయంత్రం 5.30లకు నిమజ్జనం ఉంటుంది.
- గిరింపేటలో సోమవారం రాత్రి 11 గంటలకు శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయం నుంచి శిరస్సు తీసుకొస్తారు. అక్కడ గంగమ్మ పందిరిలో సింహవానంపై అమ్మవారిని కొలువుదీర్చి మంగళవారం ఉదయం 5.30 గంటలకు తొలిపూజ, మధ్యాహ్నం 12 గంటల వరకు అంబలి సమర్పణ, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 10 గంటల వరకు కుంభ సమర్పణ, బుధవారం రాత్రి 7 నుంచి 10.30 గంటలకు వరకు ఊరేగింపు ఉంటుంది.


నడివీధిలో అఖండ దీపం



నడివీధిలో ఏర్పాటు చేసిన దీపం

నడివీధిలో గంగమ్మను ప్రతిష్ఠించే చోట కొలువుదీరిన దీపం నిత్యం కాంతిమయమై వెలుగొందుతోంది. అయితే ఈ దీపాన్ని పూర్వీకులు అఖండ జ్యోతిగా పిలుస్తారు. అమ్మవారిని ప్రతిష్ఠించే చోట చాటింపు రోజు దీపం వెలిగిస్తారు. ఆ దీపానికి ప్రత్యేక పూజలు చేసి ప్రాణ ప్రతిష్ఠ చేస్తారు. దీపం పరబ్రహ్మస్వరూపిణిగా భావించి బలిదానాలతో ఉగ్రరూపాన్ని పోస్తారు. జాతర ముగింపు వరకు ఈ దీపం ఆరనీయకుండా జాతర నిర్వాహకులు చూసుకుంటారు. అమ్మవారిని నిమజ్జనం చేసిన తర్వాతనే అఖండ జ్యోతిని కొండెక్కిస్తారు.

- కొంగారెడ్డిపల్లిలో ఈ సారి గంగజాతర నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఉదయం 6 గంటలకు గంగమ్మకు మొదటిపూజ చేయనున్నారు. 9.10గంటలకు అంబలి పూజ, సాయంత్రం 5గంటలకు కుంభం, రాత్రి 10గంటలకు పాటకచ్చేరి, బుధవారం రాత్రి 8 గంటలకు నిమజ్జనం ఉంటుంది. 10.30గంటలకు ఐ ఆస్పత్రి వెనుక బావిలో జలధి చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.



కొంగారెడ్డిపల్లి గంగమ్మ మండపం

ముత్యపు పందిరిలో మువ్వగోపాలుడు



ముత్యపు పందిరిలో ఊరేగుతున్న వేణుగోపాలుడు

కార్వేటినగరం: పట్టణంలోని టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం రాత్రి ముత్యపు పందిరిలో, ఉదయం సింహ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. తెల్లవారు జామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అభిషేకం, శుద్ధి, తోమాల, అర్చన జరిపి తొలిగంటలో నైవేద్యం సమర్పించారు. ఉదయం 7.30 గంటలకు వేద నరసింహ అవతారంలో స్వామివారు మృగరాజు అయిన సింహ వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులకు సుగంధ ద్రవ్యాలతో వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ అవతారంలోని శ్రీవేణుగోపాలునికి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపంలో టీటీడీ బృందం గాత్ర కచ్చేరితో కనుల పండువగా ఊంజల్‌సేవ నిర్వహించారు.

ముత్యపు పందిరిలో..

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి రుక్మిణీ సత్యభామ సమేతుడై శ్రీవేణుగోపాలుడు ముత్యపు పందిరి వాహనంపై కొలువుదీరి చిన్నారుల కోలాటాలు, మహిళల చెక్కభజనల, మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా పురవీధుల్లో ఊరేగారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కు చెల్లించుకున్నారు. రాత్రి 9.30 గంటలకు ఏకాంత సేవతో స్వామి వారిని పవళింప చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ నాగరత్న, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్‌కుమార్ కంకణభట్టు గోపాలాచార్యులు,నారాయణ దాసరి,కిరణ్ భట్టాచార్యులు, సుందరవరదాచార్యులు, టీటీడీ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు మంగళవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై శ్రీవేణుగోపాలుడు ఊరేగనున్నారు. ఆలయంలో సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు, భక్తులు రూ.750 చెల్లించి దంపతులు లేదా ఇద్దరు భక్తులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. రాత్రి 8 గంటల నుంచి సర్వ భూపాలవాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మరింత మెరుగైన సేవలు

- ఈ నెల 25 లోపు వసతి గృహాలకు మరమ్మతులు
- జగనన్నకు చెబుదాంపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ షణ్మోహన్ వెల్లడి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజలకు మరింతగా మెరుగైన సేవలందించాలని కలెక్టర్ షణ్మోహన్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పలు శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభించిందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు ఆ కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. స్పందనలో నమోదయ్యే అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని స్పష్టం చేశారు. స్పందనలో నమోదయ్యే అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సామూహిక గృహ ప్రవేశాలకు సంబంధించిన వారాంతపు లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులు ఈ నెల 25 లోపు పూర్తి చేయాలని సంక్షేమ శాఖాధికారులను ఆదేశించారు. ఎపిక్ కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయడంలో తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల్లో మండలాలకు కేటాయించిన లక్ష్యం పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో త్వరితగతిన ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, ఆర్ఎల్ స్థాయిలో ఉన్న గృహాలు పూర్తి చేయాలని తెలిపారు. ఇందుకు స్వయం సహాయక సంఘాల మహిళలకు అవసరమైన రుణాలు మంజూరు చేయాలని సూచించారు. జాబ్ కార్డు కలిగి ఉన్న వారందరికీ ఖచ్చితంగా ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆదేశించారు. నాడు నేడు పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్వో ఎన్.రాజశేఖర్, హౌసింగ్ పీడీ పద్మనాభం, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఇరిగేషన్, పిఆర్, ఆర్అండ్‌బీ ఎస్ఈలు విజయ్ కుమార్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, దేవానందం, డీఆర్డీఏ, మెప్మా, డ్వామా పీడీలు తులసి, రాధమ్మ, గంగా భవానీ, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట రమణా రెడ్డి, డీఈవో విజయేంద్రరావు, సంక్షేమ శాఖల అధికారులు రాజ్యలక్ష్మి, నరసింహులు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల తనిఖీ



విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న అధికారులు

వి.కోట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీలో ఎటువంటి లోటు పాట్లు లేకుండా పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర అధికారిగీత, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారి గుణశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. వారు మండల వనరుల కేంద్రంలో సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను తనిఖీ చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ బ్యాగ్‌లు, నోట్ బుక్స్, మిగిలిన పాఠ్యపుస్తకాలు త్వరితగతిన పంపిణీ చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎంఈవో చంద్రశేఖర్, ఇంజినీర్లు, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఏపీఈఏపీ సెట్ -2023 సోమవారం పకడ్బందీగా నిర్వహించారు. ప్రభుత్వం జారీచేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. మొదటి రోజు సోమవారం ప్రారంభ పరీక్ష ప్రశాంతంగా పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఏపీఈఏపీ సెట్ (ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సులలో ప్రవేశాలకు) దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షల్లో 1177 మంది విద్యార్థులకు గాను 1088 మంది పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

సకాలంలో స్పందించకపోతే చర్యలు





వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, అర్జీల స్వీకరణలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : స్పందనలో నమోదయ్యే అర్జీల పరిష్కారం పట్ల క్షేత్రస్థాయిలో అధికారులు సకాలంలో స్పందించకపోతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని జేసీ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అధికారులకు వినతులను అందజేశారు. జేసీతో పాటు డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి వినతులను స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి 294 అర్జీలు వచ్చాయని అధికారులు వెల్లడించారు.

స్పందనకు 26 ఫిర్యాదులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని ఫిర్యాదులకు అక్కడిక్కడికే పరిష్కరించగా..మరికొన్నింటిని ఆయా స్టేషన్ అధికారులకు అప్పగించారు. మొత్తం 26 ఫిర్యాదులు రాగా అందులో కట్నం వేధింపులు 1, కుటుంబ తగాదాలు 3, వేధింపులు 6, భూ తగదాలు 11, మిస్సింగ్ 1, ఆర్థిక తగాదాలు 4 చొప్పున అందాయని అధికారులు పేర్కొన్నారు.

ఏనుగుల దాడిలో మరో ప్రాణం పోనివ్వం

- బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీలో ఎమ్మెల్సీ భరత్



ఏనుగు బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: ఏనుగుల దాడిలో మరో ప్రాణం పోనివ్వమని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. కుప్పం అటవీ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఏనుగుల దాడిలో మృతి చెందిన ఉష, శివలింగం కుటుంబ సభ్యులకు చెరో ఐదు లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. మిగిలిన ఐదు లక్షలు తరువాత ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ, గజరాజుల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు అధికారులు, నాయకులు కలిసి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్ర అధికారులతో త్వరలోనే చర్చించనున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ఏనుగుల సంచారంలో ఉన్నప్పుడు జనం అధికారుల సూచనలు పాటించాలని కోరారు. గత నాలుగేళ్లలో ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన 70 మంది రైతులకు రూ.18 లక్షల ఆర్థికసాయాన్ని పంపిణీ చేశారు. మృతి చెందిన ఉష కుమారుడు విశ్వనాథ్, శివలింగం కుమారుడు కన్నప్పకు ఐదు లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో చైతన్య కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి రేంజర్ చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ ఏడీఎస్ శరవణ, నాయకులు మురుగేష్, బాబురెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృషభ చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ



వృషభ ట్రైలర్‌ను ఆవిష్కరిస్తున్న చిత్ర బృందం

పలమనేరు: పట్టణానికి చెందిన యువకులు నిర్మించి సారథ్యం వహిస్తున్న వృషభ సినిమా ట్రైలర్ లాంచ్ గంగజాతర సందర్భంగా ఆర్టీసీ బస్టాండు వద్ద చిత్ర యూనిట్ సోమవారం ఆవిష్కరించారు. నిర్మాత సి.ఉమాశంకర్‌రెడ్డి మాట్లాడుతూ వీకే మూవీస్ బ్యానర్‌పై గోమాతకు మనిషికి ఉన్న అనుబంధంపై ఈ సినిమా ఉంటుందని తెలిపారు. ఇందులో హీరో, హీరోయిన్‌లుగా జీవన్‌రెడ్డి, అలేఖ్య నటిస్తున్నారని తెలిపారు. చిత్రానికి అశ్విని కామరాజ్ కొప్పాల దర్శకత్వం వహిస్తున్నారని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని చిత్తూరు ఎస్ఈబీ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బంగారుపాళెం మండలం టేకుమందలో ఎస్ఈబీ పోలీసులు తనిఖీలు చేయగా అదే గ్రామానికి చెందిన దామోదరం (35) ద్విచక్రవాహనంలో 48 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తీసుకెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇదే మండలంలోని కరిడిమడుగు క్రాస్ వద్ద మురుగయ్య (59) నుంచి 15 క్వార్టర్ బాటిళ్లను సీజ్ చేశారు. నిందితులిద్దరినీ అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ప్రొబేషనరీ ఏఈఎస్ శ్రీరాం, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది మమత, వెంకటేష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతరో.. జాతర!

- పలమనేరు వీధుల్లో లక్షల్లో పగిలిన కొబ్బరికాయలు
- గంగమ్మ విశ్వరూప దర్శనానికి పోటెత్తిన జనం
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పట్టణంలో ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తిరుపతి గంగమ్మ జాతర సోమవారం వైభవంగా జరిగింది. దేదీప్యమైన కాంతులతో అమ్మవారు సోమవారం తెల్లవారుజాము నుంచి భక్తుల దర్శనార్థం కొలువు దీరారు. శిరస్సు మెరవణి తర్వాత అమ్మవారిని విశ్వరూపదర్శనానికి ఉంచారు. పలమనేరు పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల మండలాల ప్రజలు, పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పట్టణంలోని పలు వీధుల్లో ఇసుక వేస్తే రాలనంత జనం జాతరకు వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ దంపతులు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, మాజీమంత్రి అమరనాథ రెడ్డి సతీమణి రేణుకా రెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో శిరస్సు మెరవణి

అమ్మవారి బంగారు శిరస్సు మెరవణి ఆదివారం అర్ధరాత్రి పాతపేటలోని వేణుగోపాలస్వామి ఆలయం నుంచి ప్రారంభమైంది మంగళవాయిద్యాలు, బళ్లారి డ్రమ్ములు, నయ్యాడి డ్యాన్సులు, బుట్ట బొమ్మలు, దేవతల వేషధారణల నడుమ టీకే స్ట్రీట్, నేషనల్ హైవే, జవిళివీధి, బజారువీధుల మీదుగా సాగింది. ఊరేగింపులో ప్రతి ఇంటి వద్ద శిరస్సుకు భక్తులు హారతులిచ్చి, 101 టెంకాయలను కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి గంగమ్మకు లక్షలాది కొబ్బరికాయలు సమర్పించారు. సాంస్కృతిక వేడుకలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాణాసంచా, సౌండ్ లైటింగ్ తదితరాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



పలమనేరు వీధుల్లో శిరస్సు ఊరేగింపులో పోటెత్తిన జనం



అమ్మవారి శిరస్సు దర్శనం

పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన విద్యుద్దీప అలంకరణలు ప్రత్యేకంగా నిలిచాయి. కీలుగుర్రాలు, పాటకచ్చేరి, బళ్లారి డ్రమ్స్, బుట్టబొమ్మలు, రాజమండ్రి వారిచే అమ్మవారి ప్రదర్శనలు, పేపర్‌బ్లాస్టింగులు, వీరభద్ర వేషాలు, చెక్కభజనలు, కోలాటలు, పిల్లనగ్రోవులు, పండరీ భజనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పోలీసుల ముందస్తు హెచ్చరికలు, సీసీ కెమెరాల ఏర్పాటుతో ఈ దఫా జాతరలో దొంగతనాలు తగ్గాయి. పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక బలగాలతో గట్టి బందోబస్తు నిర్వహించారు.

జాతర కోలాహలం

పట్టణంలో జాతర సందర్భంగా కోలాహలం నెలకొంది. పలు చోట్ల స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు పానకం, మజ్జిగను, ప్రసాదాలను పంపిణీ చేశారు. పలు ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. మున్సిపల్ కార్యాలయం వద్ద గాండ్ల సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద అన్నదానం, మజ్జిగ పంపిణీ చేశారు. సూపర్‌బజార్ వద్ద ఆ సంఘం అధ్యక్షులు సుభాష్‌చంద్రబోష్, పట్టణానికి చెందిన లారీ ఓనర్స్ మరియు వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. విచిత్ర వేషధారణలు, ఓంశక్తి భక్తుల విన్యాసాలు అబ్బురపరిచాయి.

అబ్బురపరిచిన రోబో యువతి

మండలంలోని మొరం గ్రామానికి చెందిన గ్రామీణ శాస్త్రవేత్త పవన్ రూపొందించిన అమ్మవారికి పూలను సమర్పించే రోబో యువతి భక్తులను విశేషంగా ఆకర్షించింది. దీన్ని నెలరోజుల పాటు శ్రమించి ప్రత్యేకంగా గంగమ్మ జాతరకోసం రూపొందించిందినట్టు పవన్ తెలిపాడు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



జాతరలో బాణసంచా వెలుగులు



అమ్మవారి సేవలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

నేటి జలధితో ముగింపు

గంగమ్మ జాతర నేటి జలధితో ముగియనుంది. మంగళవారం ఉదయం అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి గాంధీనగర్ సమీపంలోని బావిలో జలధి చేస్తారు.

ఈచర్‌ను ఢీకొన్న కారు

గంగవరం: ఆగివున్న ఈచర్ వాహనాన్ని కారు ఢీకొనడంతో, తల్లికి తీవ్ర గాయాలవగా, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఒంగోలు జిల్లా నానురుపాడుపిల్ల గ్రామానికి చెందిన తల్లి వెంకటలక్ష్మి(55), కుమారుడు శ్రీనివాసులు(20) కలిసి కారులో స్వగ్రామం నుంచి బెంగళూరుకు బయల్దేరారు. శ్రీనివాసులు అతివేగంగా కారును నడుపుతూ, పలమనేరు-బెంగళూరు జాతీయ రహదారిలోని గోశాల సమీపంలో రోడ్డు పక్కన ఆగివున్న ఈచర్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారు వెనుక కూర్చున్న తల్లికి తీవ్ర గాయాలవగా కొడుకు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం మేరకు ఏఎస్ఐ అశ్వత్థనారాయణ, పోలీసు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి తల్లి వెంకటలక్ష్మితోపాటు కొడుకుని చికిత్స నిమిత్తం హుటాహుటిన పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటన స్థలంలో వాహనాలు

కమనీయం ద్రౌపదీ దేవి కల్యాణం



కల్యాణోత్సవం చేస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి కల్యాణం కనులవిందుగా సాగింది. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణిచే హరికథ కాలక్షేపం నిర్వహించారు. సాయంత్రం ఆలయం ఆవరణలో పెళ్లి పందిరి ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా మాంగల్యధారణ చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.78,000
రిటైల్ వెండి గ్రాము	రూ.80

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సతీష్‌కుమార్ మృత దేహం

కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తురకమిట్ట సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ దస్తగిరి కథనం మేరకు, పళ్లిపట్టు సమీపంలోని ఈచ్చాంబడి గ్రామానికి చెందిన మునస్వామి కుమారుడు ఎం.సతీష్‌కుమార్(22) పళ్లిపట్టు నుంచి పుత్తూరు వైపు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. అతి వేగంగా నడపడంతో తురకమిట్ట వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకువెళ్లింది. దీంతో సతీష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



ఆస్పత్రిలో మృతి చెందిన కరుణకరన్

విజయపురం (నగరి): విజయపురం మండల కేంద్రానికి చెందిన ఉపాధి కూలీ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, కరుణకరన్ (43) ఉదయం ఉపాధి హామీ పనికి వెళ్లాడు. అక్కడ పని చేస్తుండగా ఛాతీలో నొప్పిగా ఉందంటూ అక్కడే కుప్పకూలిపోయాడు. కూలీలు వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఎన్టీపీసీ నుంచి

ప్రభుత్వమే విద్యుత్ కొనుగోలు

- వ్యవసాయ, రాయితీ విద్యుత్‌తో ప్రభుత్వంపై రూ.11 వేల కోట్ల భారం
- ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి

బి.కొత్తకోట: ఏ ప్రభుత్వమూ చేయని విధంగా ప్రభుత్వమే నేరుగా విద్యుత్‌ను కొనుగోలు చేసి డిస్కంలకు సరఫరా చేయనుందని విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ సీవీ.నాగార్జునరెడ్డి వెల్లడించారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌కు ఆయన సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా డిస్కంలు విద్యుత్‌ను కొనుగోలుచేసి సరఫరా చేసేవని, ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయానికి పగటిపూట తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు ఎన్టీపీసీ నుంచి సోలార్ విద్యుత్‌ను చవకగా కొనుగోలు ఒప్పందం చేసుకుందని చెప్పారు. ప్రస్తుతం వ్యవసాయానికి సరఫరా చేసే విద్యుత్‌కు ప్రభుత్వం యూనిట్‌కు రూ.7.05 చెల్లిస్తోందని, ఇది భారం కావడంతో ప్రభుత్వమే నేరుగా సోలార్ విద్యుత్‌ను యూనిట్‌కు రూ.2.49 చెల్లించి కొంటుందని, వచ్చే ఏడాది అక్టోబర్ నుంచి 2027 వరకు మూడు విడతల్లో ఏడువేల మెగా యూనిట్ల సోలార్ విద్యుత్‌ను రైతులకు ఎన్టీపీసీ నుంచి సరఫరా చేయడం జరుగుతుందని చెప్పారు. దీనికోసం డిస్కంలకు చెందిన వ్యవస్థను ఉపయోగించుకునే ఎన్టీపీసీ కొంత మొత్తం డిస్కంలకు చెల్లిస్తుందని చెప్పారు. ఈ ఒప్పందం వల్ల ప్రభుత్వానికి భారం తగ్గి ఊరట లభిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో యూనిట్‌కు రూ.4.83 చెల్లించి విద్యుత్‌ను కొనుగోలు చేశారని అన్నారు. 2014–19 మధ్య అంచనాకు, వాస్తవానికి మధ్య లోటు విలువను ట్రూఅప్ చార్జీలుగా వసూలు చేయకపోవడంతో రూ.17వేల కోట్ల భారం ప్రస్తుత ప్రభుత్వంపై పడిందన్నారు. ఈ ఏడాది వినియోగదారులపై పైసా భారం మోపలేదని, ప్రభుత్వమే రూ11వేల కోట్ల భారం మోసిందన్నారు. వినియోదారుల నుంచి కిలోవాట్‌కు రూ.10 డిపాజిట్లను వసూలు చేశామన్నారు.

మీటర్ లేకున్నా ఖాతాలకు నగదు బదిలీ

2003 విద్యుత్ చట్ట ప్రకారం సరఫరా చేసే ప్రతి యూనిట్ విద్యుత్‌కు లెక్క ఉండాలని చెబుతోందని, ఇదే విషయంపై కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందని జస్టిస్ నాగార్జునరెడ్డి చెప్పారు. ఇందులో భాగంగా జవాబుదారి కోసం వ్యవసాయ బోర్లకు మీటర్లు ఏర్పాటు చేస్తే వినియోగించే విద్యుత్ లెక్క తేలుతుందనికి, దీని విలువను లెక్కించి ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదును బదిలీ చేస్తుందన్నారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మంచి సంస్కరణ అయినప్పటికి అపోహలు వచ్చాయన్నారు. రైతులు బోర్లకు మీటర్లు పెట్టుకోకపోయినా వినియోగించే విద్యుత్ బిల్లు సొమ్మును ప్రభుత్వం ఖాతాలకు జమ చేస్తుందని, తర్వాత డిస్కంలకు బదిలీ అవుతుందన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం రూ.9వేల కోట్లు, రాయితీ పొందుతున్న వర్గాలకు రూ.2వేల కోట్ల భారాన్ని ప్రభుత్వం భరిస్తోందన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ



ప్రమాద స్థలంలో లారీ, కారు

పూతలపట్టు: పూతలపట్టు మండలం, బండపల్లి వద్ద ఓ లారీ సోమవారం అతివేగంగా దూసుకొచ్చి డివైడర్‌ను ఢీకొంది. దీని దెబ్బకు పక్కన ఉన్న కరెంటు స్తంభం వాలి తిరుపతి నుంచి చిత్తూరు వైపు వస్తున్న కారుపై పడింది. కారులోని వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా లారీ డ్రైవర్ పరారైనట్లు పోలీసులు చెబుతున్నారు.

తిరుపతి గంగమ్మ జాతరకు సర్వం సిద్ధం



ఆలయం వద్ద వేసిన చలువ పందిళ్లు

కుప్పం: పట్టణంలో వెలసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర ఏర్పాటు ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 9వ తేదీ జాతరకు చాంటిపు వేశారు. ఆలయ పునర్నిర్మాణం తరువాత నిర్వహిస్తున్న తొలి జాతరలో అమ్మవారికి మొక్కు చెల్లించుకోవడానికి భక్తులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జాతర కోసం ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణం చుట్టూ చలువ పందిరి వేసి, కర్ణాటక రాష్ట్రం బంగారుపేట చెందిన విద్యుత్ దీపాలంకరణతో పట్టణ వీధులను ముస్తాబు చేస్తున్నారు. అమ్మవారి ప్రతిమతో కూడిన విద్యుత్ కటౌట్లు పట్టణ నాలుగు ముఖ ద్వారాల్లో ఏర్పాటు చేశారు. శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర బుధవారం రాత్రి వినాయక ఉత్సవం ఊరేగింపుతో ప్రారంభం అవుతుంది.

పిల్లలకు పోటీ పరీక్షలు అవసరం



విశ్వనాథరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : పిల్లలకు పోటీ పరీక్షలు అవసరమని, ఈ మేరకు వారిని సన్నద్ధం చేయాలని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలు రాసేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్లో క్రమశిక్షణతో కూడిన చక్కని విద్యనందించి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తారని వెల్లడించారు. 33ఏళ్ల తమ సంస్థ ప్రస్థానంలో ఎందరో విద్యార్థులకు పోటీ పరీక్షల్లో శిక్షణ అందించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఇసమాచారం కోసం 93999 76999, 86888 88802 నంబర్లలో సంప్రదించాలని కోరారు.